క్లుప్తంగా

నృసింహుని మాలధారులకు దుస్తులు అందజేత



మంగళగిరి: స్థానిక శ్రీపానకాల లక్ష్మీ నృసింహ స్వామి మాలధారణ భక్తులకు నగరానికి చెందిన తోట శ్రీనివాస్ నూతన వస్త్రాలను అందజేశారు. 16 సంవత్సరాలుగా నృసింహుని మాలధారణ చేస్తున్న భక్తులకు వస్త్రాలను అందజేస్తున్న ఆయన బుధవారం నృసింహుని అర్ధమండల దీక్షా పరులకు నూతన వస్త్రాలను అందజేయగా గురుస్వామి మాల్యవంతం శ్రీనివాసదీక్షితులు మాల ధారణ చేశారు. కార్యక్రమంలో తోట సాంబ, చింకా మహేష్, రుద్రు వినయ్, చింకా లవణ్ కృష్ణ, చిన్న వెంకట శేషు, యర్రాకుల సురేష్ పాల్గొన్నారు.

బీసీ జనభేరి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



మంగళగిరి: నగరంలోని బీసీ సేన కార్యాలయంలో బీసీ జనభేరి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోలి నాగకుమార్ మాట్లాడుతూ బీసీ హక్కుల సాధన కోసం ఈనెల 22వ తేదీన నియోజక వర్గ బీసీ సేన ఆధ్వర్యంలో నగరంలోని ఈద్గా ఫంక్షన్ హాల్ ఆవరణలో జనభేరి నిర్వహించనున్నట్లు చెప్పారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా బీసీ సేన జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షులు శౌంరి నాగరాజు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పరసా రంగనాథ్, మీనిగ ఆంజనేయులు, కుంచాల కిషోర్, సాధు వేణుగోపాల్, కుర్నెళ్ల వెంకట కోటేశ్వరరావు, నక్కా దుర్గా మహేష్, కుంచాల శ్రీను, తాడిమల వేణు, గండికోట వెంకయ్య పాల్గొన్నారు.


ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

అడిషనల్ కమిషనర్ హేమమాలిని



మంగళగిరి: ఓటరు కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆధార్‌కార్డు అనుసంధానం చేసుకోవాలని అడిషనల్ కమిషనర్ హేమమాలిని అన్నారు. నగరంలోని టిడ్కో గృహ సముదాయం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడ్కో లబ్ధిదారులకు అందుబాటులో ఉండేందుకు ఈ క్యాంపు నిర్వహించడం జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా ఆధార్ లింకు చేయించుకోని వారు ఉంటే ఆందోళన చెందాల్సిన పని లేదని, సంబంధిత పోలింగ్ స్టేషన్, సచివాలయంలో సంప్రదించి ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవచ్చునన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో నూరుశాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని కోరారు.

ఎస్టీయూ పాకెట్ బుక్ ఆవిష్కరణ



ఫిరంగిపురం: మండల ఎస్టీయూ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పాకెట్ బుక్‌ను ఎంఈఓ సాల్మన్‌రాజు బుధవారం ఆవిష్కరించారు. ఎంఈఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యనందించాలన్నారు. పాకెట్ బుక్ ఉపాధ్యాయులకు ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు.

ఆటో డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

మంగళగిరి: ఆటోను నిర్లక్ష్యంగా నడిపి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని ఢీకొట్టి గాయపర్చిన ఘటనలో ఆటో డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.శ్రీప్రత్యూష బుధవారం తీర్పు చెప్పారు. ఏపీపీ ఎస్.నాగమణి కథనం ప్రకారం. 2016 నవంబరు 19వ తేదీన మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి నిడమర్రుకు చెందిన వెంకటేశ్వర్లు, మంగళగిరికి చెందిన ఎం.చిన్న వందనం వడ్రంగి పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యలోని నిడమర్రు రైల్వే గేటు వద్దకు వచ్చేసరికి మంగళగిరి వైపు నుంచి ఎదురుగా అతివేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడు వెంకటేశ్వర్లు మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి ఆటోడ్రైవర్‌ను అరెస్టుచేసి కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి నిడమర్రుకు చెందిన నిందితుడు కుర్రా శ్రీనివాసరావుకు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ప్రభుత్వ పాలనలో సంతోషంగా ప్రజలు

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 31వ వార్డులో ముగిసిన గడప గడపకు మన ప్రభుత్వం



మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 31వ వార్డు మార్గ్ అపార్ట్‌మెంట్ దగ్గర నుంచి బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 31వ వార్డు కౌన్సిలర్ గోగిరెడ్డి మానసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సతీష్‌రెడ్డి, వార్డు నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేశారని గుర్తుచేశారు. సంక్షేమాన్ని ఎటువంటి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా అందిస్తున్నట్లు చెప్పారు. సంక్షేమం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణం ఎంతో మెరుగుపడిందని వివరించారు. 31వ వార్డులో ప్రధానంగా డ్రెయినేజీ సమస్య ఎక్కువగా ఉందని, అలాగే జెండా చెట్టు రోడ్డు పల్లంగా ఉండటం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. వీటిని రెండుమూడు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఇప్పటి వరకు ప్రజలు తెలియజేసిన రేషన్ డీలర్ల, విద్యుత్ రీడింగ్ సమస్యలను రెండు రోజుల్లో పరిష్కరించనున్నట్లు చెప్పారు. మురుగు కాల్వల సమస్యను సచివాలయాలకు ప్రభుత్వం ఇచ్చే రూ.20 లక్షల నిధులతో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. సమస్యలన్నీ నాలుగు నెలల లోపు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 31వ వార్డులో ఇప్పటి వరకు ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా రూ.15.33 కోట్ల లబ్ధిని చేకూర్చినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు షేక్ దుబాయ్ బాబు, యాతాటి అనిల్, పేరం సంజీవరెడ్డి, మొగల్ అహ్మద్ బేగ్, 31వ వార్డు నాయకులు షేక్ బాబావలీ, సయ్యద్ నబీ, మస్తాన్, అహ్మద్, యుసూబ్, అన్వర్, కృష్ణ, రావి శ్రీనివాసరావు, జీఎంఆర్. గద్దల రమేష్, డి.బాబు, ప్రతాప్, జ్యోత్స్న, కాలం కోటేశ్వరరావు, ఆశీ, వైఎస్సార్ సీపీ నాయకులు అక్కిదాసు కిరణ్ కుమార్, చుండూరి వెంకటేశ్వరరావు, కఠారి హరీష్, చుక్కా ఆనంద్, అడుసుమల్లి శ్రీనివాసరావు, కాళిదాసు వెంకట సత్యం, కాళిదాసు వెంకటేశ్వరరావు, బూరెల దుర్గ, పెసర్లంక రమణ, తాడిబోయిన పోలు రాజు, రావి ప్రశాంతి, పోతిరెడ్డి హేమలత, శ్రీను నాయక్, బండ్లమూడి భాస్కరరావు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ ఉమాప్రణతి

తెనాలిటౌన్: క్షయ, హెచ్ఐవీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీలు నిర్వహించడం అభినందనీయమని జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి పేర్కొన్నారు. పట్టణ చెంచుపేటలోని ప్రభుత్వ వైద్యశాల ఎదురుగా ఉన్న ప్రైవేట్ విద్యా భవనంలో సోమవారం ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు సేవాసంస్థ వ్యవస్థాపకులు, అధ్యక్షులు గోరికపూడి బాలరాజు అధ్యక్షత వహించారు. సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ ఉమాప్రణతి మాట్లాడుతూ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ రవిశేఖర్ మాట్లాడుతూ కోవిడ్ లాంటి అనేక రకాలైన వ్యాధులతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. సమాజానికి, కుటుంబాలకు ఆదరణ కల్పించాల్సిన సమయంలో ఆదరణ సేవా సంస్థ సభ్యులు అవగాహన సదస్సులు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ప్రెసిడెంట్ బాలరాజు మాట్లాడుతూ క్షయ, హెచ్ఐవీ తదితర వ్యాధిగ్రస్తులకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాణి, కో–ఆర్డినేటర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణకు అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొల్లిపర: సైకిల్ వ్యాయామం ద్వారా ఆరోగ్యకర జీవనాన్ని పొందవచ్చని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొత్తపల్లి బాబురావు చెప్పారు. సైకిల్ వ్యాయామం–క్యాన్సర్ తగ్గుదల అనే అంశంపై మున్నంగి గ్రామంలో అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. డాక్టర్ బాబురావు మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డి.స్వరూపరాణి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, వంగర బుజ్జిబాబు, పీహెచ్ఈఎస్ కోటేశ్వరి, వ్యాయామ ఉపాధ్యాయులు బి.రమేష్, ఉపాధ్యాయులు సాంబశివరావు, పఠాన్, ఆలీఖాన్, హెల్త్ అసిస్టెంట్ నాగమల్లేశ్వరరావు, ఏఎన్ఎం కుసుమ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ సాయికిరణ్

తెనాలిటౌన్: ఒంగోలులో ఈనెల 12న జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రూరల్ మండలం కఠెవరంలోని నివాస్ షిటో అకాడమీ విద్యార్థులు పలు పతకాలు సాధించినట్లు కోచ్ కె.సాయికిరణ్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులకు ఇంటర్నేషనల్ కరాటే ఇన్‌స్ట్రక్టర్ సుదర్శన్ చేతుల మీదుగా మెడల్లను అందించినట్లు తెలిపారు. పోటీలలో అకాడమీ విద్యార్థులు పి.హరినారాయణ రాజు, సాత్విక్, కార్తీక్, రాకేష్ బంగారు పతకాలు సాధించారని, కె.పల్లవి, రిషిక, విజయ్, సుశాత్ రాజు వెండి పతకాలను సాధించారని వివరించారు. ఈ నెల 19న మచిలీపట్నంలో జరిగే ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీలలో విద్యార్థులు పాల్గొంటున్నట్లు కోచ్ చెప్పారు.

టిప్పర్ సీజ్



టిప్పర్‌ను సీజ్ చేసిన ఎస్ఈబీ అధికారులు

తెనాలి రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) అధికారులు గుర్తించి సీజ్ చేశారు. తెనాలి మండలం కొలకలూరు వద్ద గుంటూరు–హనుమాన్‌పాలెం రహదారిపై బుధవారం తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది ఆకస్మికంగా వాహన తనిఖీలను చేపట్టారు. ఎటువంటి బిల్లులూ లేకుండా 35 టన్నుల ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను గుర్తించి సీజ్ చేశారు. తదుపరి చర్యల కోసం రూరల్ పోలీసులకు అప్పగించారు. అలాగే అధిక లోడుతో వెళ్తున్న మరో టిప్పర్ యజమానికి రూ.10 వేల జరిమానా విధించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



తెనాలి రూరల్: రోడ్డు వెంబడి మృతి చెంది పడి ఉన్న వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. తెనాలి పాత ప్రభుత్వ వైద్యశాల సమీపంలో రోడ్డు వెంబడి సుమారు 60 నుంచి 65 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. అతను ఎర్ర చొక్కా, నల్ల లుంగీ ధరించి ఉన్నాడు. గమనించిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారమివ్వగా, వారు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళాకారుడు నాగేంద్రప్రసాద్‌కు సన్మానం



నాగేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న శ్రీనివాసరావు, అరవింద్ బాబు తదితరులు

తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం ఇంటికి దీపం ఇల్లాలే చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం జయం మనదే చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ పౌరాణిక నాటక కళాకారుడు పొదిలి నాగేంద్రప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో చల్లగాలి శ్రీనివాసరావు, పాశం గోవింద మండడి, పుట్టి అరవింద్ బాబు, శ్రీకాకుళపు జయంత్ బాబు, శ్రీకాకుళపు మురళీకృష్ణ, నరేష్ కుమార్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సోమవరపు సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని,ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, యోహాను, అప్పయ్య, వెంకటేశ్వర్లు, తరణి హేమంత్‌కుమార్, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు చింతాయపాలెం విద్యార్థులు



జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

చింతాయపాలెం(కర్లపాలెం): పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యారని చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం డి.శ్రీనివాసరావు తెలిపారు. సైక్లింగ్ క్రీడాకారులకు బుధవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు గోపీ మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 13 వరకు నరసరావుపేటలో జరిగిన 66వ రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో తమ పాఠశాల క్రీడాకారులు అండర్–17 బాలికల విభాగంలో పులి పల్లవి, పిట్టు అనూరాధ బంగారు పతకాలు, ఎస్‌కే జాస్మిన్ కాంస్య పతకం, అండర్–17 బాలుర విభాగంలో కుంచాల పృథ్విరెడ్డి కాంస్య పతకం, అండర్–19 బాలుర విభాగంలో కుంచల భాను కాంస్య పతకం సాధించి జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. మేనెలలో జాతీయ స్థాయిలో జరగనున్న పోటీలలో తమ పాఠశాల క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు.

సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవం



సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లంబాడ సంక్షేమ సేవా సంఘ నాయకులు

తెనాలిటౌన్: పట్టణంలోని చినరావూరులో జై సేవాలాల్ లంబాడ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవం నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భవానీ అమ్మవారి గుడి ప్రాంగణంలో భోగ్‌బండార్ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు ధారవత్ ప్రసాద్ నాయక్, కడప ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కేతావత్ మోతిలాల్, ఉపాధ్యక్షులు ఇస్లావత్ కృష్ణనాయక్, ధావియా నాయక్, కార్యదర్శి రాములు నాయక్, బాలాజీ నాయక్, సహాయ కార్యదర్శి బాలకృష్ణనాయక్, లక్ష్మణ్ నాయక్, కోశాధికారి కేశావత్ లక్ష్మణ్ నాయక్, కమిటీ సభ్యులు తండా నాయకులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికలకు క్లాత్ పెయింటింగ్ వర్క్‌పై శిక్షణ



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్ శేషాచలం

తెనాలిటౌన్: ఆర్యవైశ్యుల్లోని మధ్యతరగతి మహిళలు, బాలికల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడేలా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్ మద్దాలి శేషాచలం పేర్కొన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మహిళలు, బాలికలకు క్లాత్ పెయింటింగ్ వర్క్‌పై శిక్షణ తరగతులను బుధవారం బోసురోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. శిక్షణ తరగతులను శేషాచలం ప్రారంభించి మాట్లాడుతూ మహిళలకు ప్రయోజనకరమైన పెయింటింగ్‌పై శిక్షణ ఇస్తున్నామని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్వరలో ఆర్యవైశ్య సంఘం ద్వారా లీగల్ సెల్‌ను ఉచితంగా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మహిళలకు శిక్షణను కూరపాటి శ్రీలక్ష్మి ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, కౌన్సిలర్ గడవర్తి సాయి హరేరామ్, ఆర్యవైశ్య సంఘ నాయకులు కొల్లా గురునాథగుప్తా, అతుకూరి పూర్ణచంద్రరావు, తూనుగుంట్ల సుబ్బారావు, కర్పూరపు రఘునాథ గుప్తా, మహిళ సంఘం అధ్యక్షురాలు కొండవీటి లక్ష్మీపద్మావతి, కార్యదర్శి ఆలమూరి పూజ, కోశాధికారి ఆకీ గోవర్ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెనాలి రోడ్డుకు మరమ్మతులు

తాడేపల్లి రూరల్: తెనాలి– మంగళగిరి రహదారిలో ఉన్న బీటీ రోడ్డు వర్షాల కారణంగా గోతులు పడ్డాయి. ఎమ్మెల్యే ఆర్కే చొరవతో ఆర్ అండ్ బీ అధికారులు మంగళవారం నుంచి ఆ రోడ్డు మరమ్మతులు చేపట్టారు. మోరంపూడి, రేవేంద్రపాడు మధ్య బీటీ రోడ్ పూర్తిగా గోతుల మయం కావడంతో ఎమ్మెల్యే ఆర్కే, తెనాలి ఆర్ అండ్ బీ అధికారులను కలిసి రోడ్డు పరిస్థితి గురించి వివరించారు. స్పందించిన అధికారులు రూ.25 లక్షలు కేటాయించి పనులు చేపట్టారు. ఏఈ నరసింహారావు పర్యవేక్షిస్తున్నారు.

పుస్తక మహోత్సవంలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న చిన్నవీరభద్రుడు

తాడేపల్లి రూరల్: విజయవాడ పుస్తక మహోత్సవంలో తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఒకేషనల్ విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల సుబ్బారావు బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న ఒకేషనల్ విద్యార్థులకు పుస్తక ప్రదర్శన మహోత్సవంలో రైతులకు ఉపయోగపడే ప్రాజెక్ట్ సోలార్ స్నేక్ గాడ్ స్టిక్‌ను ప్రదర్శించారని ఇది పాముకాటుకు గురవకుండా రైతులను కాపాడుతుందని అన్నారు. అలాగే సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడుల నుంచి తమను తాము రక్షించుకునే విధంగా స్మార్ట్ స్కూల్ బ్యాగ్‌ను ప్రదర్శించినట్లు తెలిపారు. అదే విధంగా హైడ్రాలిక్ పొక్లెయిన్, డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, స్పీడ్ బ్రేకర్ ఆధారంగా ఎలక్ట్రిసిటీని తయారు చేయడం, వంటి పరికరాలను ఒకేషనల్ విద్యార్థులు తయారుచేయడం గర్వంగా ఉందని అన్నారు. ఈ ప్రాజెక్ట్‌లను పరిశీలించిన విశ్రాంత పాఠశాల విద్యా సంచాలకులు చిన్నవీరభద్రుడు, అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి విద్యార్థులను, వృత్తి విద్యా ఉపాధ్యాయిని వెంకటలక్ష్మిని అభినందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వై.అపర్ణ, ఒకేషనల్ కో–ఆర్డినేటర్లు వంశీ, చిన్నరెడ్డి, భుజంగరావు, మనోహర్, మధు, కమలాకర్, ఒకేషనల్ ట్రైనర్ వి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

యువకుడి మృతి కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

తెనాలి రూరల్: యువకుడి మృతి కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం రాత్రి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు కేసు వివరాలను వెల్లడించారు. తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన పాన్నెకంటి సోమసుందర్(22)పై అదే గ్రామానికి చెందిన కొందరు పాత కక్షల నేపథ్యంలో దాడి చేశారు. మనస్తాపానికి గురైన అతను గత నెల 14న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విజయవాడలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అదే నెల 16న మృతి చెందాడు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కొలకలూరుకు చెందిన గాజులవర్తి ప్రేమ్‌సాగర్‌పై మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి



తాడేపల్లి రూరల్: బాలికలు, మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని విశ్రాంత ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కె.ఉషారాణి తెలిపారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో విజ్ఞాన శాస్త్రంలో మహిళలు, బాలికల ప్రమేయం జాతీయస్థాయి సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు పలురకాల పరిశోధనలు చేయడంలో ముందంజలో ఉన్నారని అన్నారు. భారతదేశంలో బాల్యవివాహాల దురాచారాన్ని రూపుమాపాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. మహిళా అభివృద్ధి సెల్ సభ్యులు, అసోసియేట్ డీన్ డాక్టర్ రూతు రమ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ద్వారా బాలికలు విద్యలో అంచలంచెలుగా ఎదుగుతున్నారని అన్నారు. గూగుల్‌లో 60 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించిన పూజిత అందుకు ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు, సాక్ డైరెక్టర్ సాయి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో డ్రోన్ పైలెట్ల శిక్షణ కేంద్రం

తాడేపల్లి రూరల్: వ్యవసాయ వ్యవసాయేతర, పారిశ్రామిక రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో తాడేపల్లిలో అంకుర సంస్థ డ్రోగో డ్రోన్స్ ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంకుర సంస్థ ఎండీ యశ్వంత్ బొంతు బుధవారం మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రోన్లను ఆపరేట్ చేసే పైలెట్లకు శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన అనుమతులు పొందిన తొలి ప్రైవేటు సంస్థ తమదేనని అన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 సంవత్సరాలు నిండిన వారు డ్రోన్ ఆపరేటర్‌గా శిక్షణ పొందవచ్చని, డీజీసీఏ రూపొందించిన సిలబస్ ప్రకారం వారం రోజుల పాటు డ్రోగో డ్రోన్స్ శిక్షణ ఇస్తుందని వివరించారు. ఒక్కో బ్యాచ్‌లో 30 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా అనుమతులు పొందినట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని యశ్వంత్ చెప్పారు. తాడేపల్లిలో త్వరలో డ్రోన్ తయారీ యూనిట్ కూడా ప్రారంభించనున్నామని, డ్రోన్స్ విడిభాగాలు తయారుచేసే ప్రణాళికను తమ సంస్థ రూపొందించిందని వెల్లడించారు.